సాక్షి విజయనగరం

గురువారం | 13 | జూన్ | 2024



జీవన ఎరువులతో భూసారం

ఖరీఫ్ పంటల సాగుకు రైతులు ఇప్పుడిప్పుడే దుక్కులు చేస్తూ పంటపొలాలను సిద్ధం చేస్తున్నారు. జీవన ఎరువులతోభూసారం పెంచే చర్యలు చేపట్టారు. - 8లో



వేతనదారులకు 'ఉపాధి'

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అధిక సంఖ్యలో వేతనదారులకు పని కల్పించారు. - 8లో



విద్యార్థి కిట్‌ల పంపిణీ పరిశీలన

జిల్లాలోని అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకా ల కిట్‌లను సక్రమంగా చేరవేయనున్నట్టు పార్వతీపురం మన్యం జిల్లా డీఈఓ జి.పగడాలమ్మ తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

స్టూడెంట్ కిట్లను అందించాలి



పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్

భోగాపురం/పూసపాటిరేగ: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న బ్యాగ్‌లు, బూట్లు, పాఠ్య పుస్తకాలతో కూడిన స్టూడెంట్ కిట్లను సకాలంలో అన్ని పాఠశాలలకు చేరవేయాలని ఆర్జేడీ బి.విజయభాస్కర్ ఎంఈఓలు రమణమూర్తి, చంద్రమౌళి, రాజ్‌కుమార్, పాపినాయుడుకు సూచించారు. భోగాపురం ఆదర్శ పాఠశాల, పూసపాటిరేగ ఉన్నత పాఠశాలలో స్టూడెంట్ కిట్ల నాణ్యతను బుధవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నేటి నుంచి యథావిధిగా విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేయాలని ఎంఈఓలకు సూచించారు. ఆయన వెంట డీఈఓ ప్రేమకుమార్, ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

పైడితల్లికి పట్టువస్త్రాలు



అమ్మవారికి సుశీలమ్మ పంపిన పట్టువస్త్రాల కొరియర్ బాక్స్‌ను చూపిస్తున్న ఆలయ ఈఓ

విజయనగరం టౌన్: గానకోకిల సుశీలమ్మ ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారికి చెన్నై నుంచి పట్టువస్త్రాలను పంపించారు. అమ్మవారికి పర్వదినాల్లో అలంకరణ చేయాలని ఈఓ డీవీవీ ప్రసాదరావును కోరారు. ఈ మేరకు ఆమె పంపించిన కొరియర్ అందిందని ఈఓ బుధవారం తెలిపారు. విజయనగరవాసిగా, అమ్మవారి భక్తురాలిగా సుశీలమ్మ ప్రపంచ దేశాల్లో సంగీతరంగంలో రాణించారన్నారు. ఆమె కోరిక మేరకు అమ్మవారికి పట్టువస్త్రాలను అలంకరణ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలు, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు పాల్గొన్నారు.

రామతీర్థంలో చురుగ్గా అభివృద్ధి పనులు



దేవస్థానం వెలుపల ఫ్లోరింగ్ పనులు చేస్తున్న కార్మికులు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో వివిధ అభివృద్ధి పనులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసింది. వాటితో పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఇప్పటికే శాశ్వత యాగశాల నిర్మాణం పూర్తిచేసి ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. ప్రస్తుతం ఆలయం వెలుపల ఫ్లోరింగ్ పనులు చురుగ్గా కొనసాగుతుండడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆశాభంగం

వారంతా రాజకీయాల్లో సీనియర్లు. గెలిస్తే మంత్రి పదవి తమకే వస్తుందని గట్టిగా నమ్మారు. ఎన్నికల ప్రచార సభలు, సమీక్షల్లో పార్టీ శ్రేణుల వద్ద అదే విషయాన్ని పదేపదే ప్రస్తావించారు. తీరా గెలిచాక మంత్రి పదవులు వరించకపోవడం.. కొత్తగా ఎన్నికైన వారికే చంద్రబాబు ప్రభుత్వం పట్టంకట్టడం ప్రస్తుతం జిల్లాలోని రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

- చంద్రబాబు మంత్రివర్గంలో చోటుదక్కని సీనియర్లు
- మంత్రి పదవిపై కళా వెంకటరావు, కోండ్రు మురళీ, కోళ్ల లలితకుమారి ఆశలు
- లోకేశ్ సాన్నిహిత్యంతో కొండపల్లికి మంత్రి పదవి
- అసెంబ్లీలో తొలిసారిగా అడుగుపెడుతూనే మంత్రిగా అవకాశం
- ఎస్టీ కోటాలో గుమ్మడి సంధ్యారాణికి కేబినెట్‌లో చోటు



కోళ్ల లలితకుమారి



కోండ్రు మురళీ



కళా వెంకటరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

రాజాంలో తనను గెలిపిస్తే టీడీపీ ప్రభుత్వంలో మంత్రినవుతానన్న కోండ్రు మురళీమోహన్ మాటలు నెగ్గలేదు... చీపురుపల్లిలో సీనియర్ నాయకుడైన బొత్స సత్యనారాయణను ఓడించి వస్తే మంత్రి పదవి కచ్చితంగా ఇస్తామని కళావెంకటరావుకు చంద్రబాబు ఇచ్చిన హామీ పనిచేయలేదు... శృంగవరపుకోటలో మూడోసారి గెలిస్తే సామాజికవర్గ సమీకరణాల్లో తనకు మంత్రి పదవి వస్తుందనుకున్న కోళ్ల లలితకుమారి కలలు నెరవేరలేదు... తొలిసారిగా ఎమ్మెల్యే అయినా ఏదో ఒక లెక్కలో తమకు జాక్‌పాట్ తగలకపోతుందా అని ఆశించిన బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి లెక్కలూ ఫలితమివ్వలేదు. లోకేశ్‌తో సాన్నిహిత్యం, తన భార్యవైపు సంబంధాలతో చాపకింద నీరులా పనిచేసుకున్న కొండపల్లి శ్రీనివాస్ గజపతినగరం టీడీపీ టికెట్ దక్కించుకోవడంలోనే కాదు చంద్రబాబు మంత్రివర్గంలో చోటు సంపాదించడంలోనూ సఫలమయ్యారు. విజయనగరం జిల్లా నుంచి ఏకైక మంత్రి అయ్యారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు ఎమ్మెల్యే గుమ్మడి సంధ్యారాణి ఎస్టీ కోటాలో మంత్రి పదవి దక్కించుకున్నారు.

కోండ్రు ఆశలపై నీళ్లు...

రాజాం (ఎస్సీ) నియోజకవర్గంలో 2009లో వై.ఎస్.రాజశేఖరరెడ్డి చలువతో ఎమ్మెల్యేగా గెలిచిన కోండ్రు మురళీమోహన్ తర్వాత కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో మంత్రి పదవి కూడా నిర్వహించారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తే కేవలం 4,790 ఓట్లే వచ్చాయి. టీడీపీ తీర్థం పుచ్చుకొని 2019 సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసినా వైఎస్సార్‌సీపీ నాయకుడు కంబాల జోగులు చేతిలో చావుదెబ్బ తప్పలేదు. అప్పటివరకూ పోటీగా ఉన్న సీనియర్ నాయకురాలు ప్రతిభాభారతి ఆరోగ్య కారణాల రీత్యా క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకోవడంతో కోండ్రు పని సులువైంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించారు. తాను గెలిస్తే చంద్రబాబు కేబినెట్‌లో తనకు చోటు ఖాయమని ప్రచారం చేసుకున్న ఆయనకు ఇప్పుడు నిరాశే మిగిలింది. ఎస్సీ కోటాలో కచ్చితంగా మంత్రి పదవి వస్తుందని ఆశించినా చివరకు హడావుడే మిగిలింది.

ఎందు'కళా'..?

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా రాజకీయాల్లో చక్రం తిప్పిన టీడీపీ సీనియర్ నాయకుడు, విజయనగరం జిల్లా కొచ్చి చీపురుపల్లిలో బొత్స సత్యనారాయణ వంటి సీనియర్ నాయకుడిపై గెలిచిన కిమిడి కళావెంకటరావుకు ఈసారి చంద్రబాబు మంత్రివర్గంలో చోటు తప్పక ఉంటుందని ఆయన అనుచరులు అంతా కోటి ఆశలు పెట్టుకున్నారు. 1983లో రాజకీయ ఆరంగేట్రం చేసిన తర్వాత నుంచీ టీడీపీ అభ్యర్థిగా ఉణుకూరు నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యే అయ్యారు. ఉణుకూరు రద్దు అయిన తర్వాత ఎచ్చెర్ల నియోజకవర్గానికి మారిన ఆయన 2009 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ నుంచి పోటీచేసి ఓడిపోయారు. 2014లో మళ్లీ టీడీపీ నుంచి పోటీచేసి గెలిచారు. 2019 ఎన్నికల్లో ఓడిపోయారు. 2024 ఎన్నికల్లో చీపురుపల్లి నుంచి పోటీ చేసి బొత్స సత్యనారాయణపై విజయం సాధించారు. ఇలా ఆరుసార్లు ఎమ్మెల్యే, గతంలో రెండుసార్లు మంత్రిగా బాధ్యతలు, 1998–2004 వరకూ రాజ్యసభ సభ్యుడిగా సేవలు, అంతకుమించి టీడీపీ రాష్ట్ర శాఖకు తొలి అధ్యక్షుడిగా పనిచేసిన కళాకు ఈసారి కచ్చితంగా మంత్రి పదవి వస్తుందని అంతా భావించారు. ఆయనకు చోటు దక్కకపోవడంతో అనుచరులంతా డీలా పడిపోయారు. స్పీకర్ పదవి వరిస్తుందనే ప్రచారం జరుగుతున్నా అది ఎంతవరకూ కార్యరూపం దాల్చుతుందో చూడాలి.

'కోళ్ల' ఆశలు ఆవిరి

విజయనగరం జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాల్లో బలీయమైన సామాజికవర్గం నుంచి కోళ్ల లలితకుమారి ఒక్కరే ఈసారి అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు కోళ్ల అప్పలనాయుడి కోడలుగా, రాజకీయ వారసురాలిగా శృంగవరపుకోట నియోజకవర్గంలో మూడో సారి గెలిచిన ఆమె ఈసారైనా తనకు మంత్రి పదవి వస్తుందని ఆశించారు. ఆమెకే కాదు ఆమె సామాజికవర్గం నుంచి మరే ఎమ్మెల్యేకూ ఈసారి చంద్రబాబు మంత్రివర్గంలో చోటు లభించలేదు. దీంతో ఆ సామాజికవర్గ నాయకులంతా గుర్రుగా ఉన్నారు.

తొలిసారి గెలిచినా...

బొబ్బిలి నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన బేబీనాయనకు మంత్రి పదవి వస్తుందనే ప్రచారం జరిగింది. ఎందుకో ఆయన పేరు పరిశీలనలోనే లేకుండాపోయింది. విజయనగరం నుంచి రెండో సారి పోటీచేసి తొలిసారి ఎమ్మెల్యేగా శాసనసభలో అడుగుపెడుతున్న అదితి గజపతిరాజుకు కూడా తన తండ్రి అశోక్ గజపతిరాజు కోటాలో మంత్రి పదవి వస్తుందని బంగ్లా అభిమానులంతా ఆశలు పెట్టుకున్నారు. కానీ రాజకీయ అస్త్రసన్యాసం చేసిన అశోక్‌ను ఏదైనా రాష్ట్రానికి గవర్నర్‌ను చేయించాలని అధిష్టానం ఆలోచిస్తోందట. దీంతో అదితికి మంత్రి పదవి అవకాశం లేకుండాపోయింది. జనసేన ఎమ్మెల్యేల్లో ఏకైక మహిళ నాయకురాలిగా ఆ పార్టీ కోటాలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవికి మంత్రి పదవి వస్తుందని ఆమె అభిమానులు పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి. తుదకు గజపతినగరం ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్‌కు తూర్పుకాపు కోటాలో, సాలూరు ఎమ్మెల్యే గుమ్మడి సంధ్యారాణికి ఎస్టీ కోటాలో మంత్రి పదవులు దక్కాయి.

మంత్రిగా కొండపల్లి శ్రీనివాస్



నియోజకవర్గం: గజపతినగరం (తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు)
వయస్సు: 42 సంవత్సరాలు
విద్యార్హత: ఎంఎస్ (కంప్యూటర్ సైన్స్)
స్వగ్రామం: గంట్యాడ
కుటుంబం:
భార్య: లక్ష్మీసింధు (గృహిణి)
పిల్లలు: విహాన్ (కుమారుడు), మేధ (కుమార్తె)
తాత : కొండపల్లి పైడితల్లి నాయుడు (రెండు సార్లు లోక్‌సభ సభ్యుడిగా, ఒకసారి జెడ్పీ చైర్మన్‌గా పనిచేశారు)
తండ్రి : కొండపల్లి కొండలరావు (రెండుసార్లు గంట్యాడ ఎంపీపీగా పనిచేశారు)
చిన్నాన్న: కొండపల్లి అప్పలనాయుడు (2014–19లో టీడీపీ ఎమ్మెల్యేగా చేశారు)
పూర్వాశ్రమం: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా అమెరికా, యూఏఈ, ఈజిప్ట్ తదితర దేశాల్లో పనిచేశారు.

మంత్రి గుమ్మడి సంధ్యారాణి రాజకీయ ప్రస్థానం



నియోజకవర్గం: సాలూరు (తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు)
వయస్సు: 50 సంవత్సరాలు
విద్యార్హత: బీఎస్సీ
స్వగ్రామం: సాలూరు
కుటుంబం:
తండ్రి : జన్ని ముత్యాలు (1972–78 వరకూ కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యేగా పనిచేశారు)
తల్లి: జన్ని పార్వతమ్మ
భర్త: గుమ్మడి జయకుమార్
పిల్లలు: పృథ్వీ (కుమారుడు), ప్రణతి (కుమార్తె)
పూర్వాశ్రమం: కాంగ్రెస్ పార్టీ సాలూరు నియోజకవర్గ ఇంచార్జిగా 1999లో రాజకీయాల్లోకి వచ్చారు. అదే సంవత్సరం సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసి అప్పటి టీడీపీ అభ్యర్థి ఆర్పీ భంజ్‌దేవ్ చేతిలో ఓడిపోయారు. 2009 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి నాటి కాంగ్రెస్ అభ్యర్థి పీడిక రాజన్నదొర చేతిలో ఓడిపోయారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో అరకు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థిగా పోటీచేసినా మళ్లీ ఓటమి తప్పలేదు. 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆమెను ఎమ్మెల్సీగా చేసింది. 2021 వరకూ ఎమ్మెల్సీ పదవిలో ఉన్నారు. తర్వాత నుంచి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలిగా కొనసాగుతున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీడిక రాజన్నదొరపై గెలుపొందారు. తొలిసారి ఎమ్మెల్యే అయిన ఆమెకు చంద్రబాబు మంత్రివర్గంలోనూ చోటు దక్కింది.

బాలలంతా బడిలోనే ఉండాలి

- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు



ర్యాలీని ప్రారంభిస్తున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు

విజయనగరం ఫోర్ట్: బాలలంతా బడిలో ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు కేసలి అప్పారావు అన్నారు. అంతర్జాతీయ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కోట వద్ద బుధవారం నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ర్యాలీ కోట కూడలి నుంచి మూడు లాంతర్లు మీదుగా బాలాజీ కూడలి వరకు సాగింది. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ బాలలను పనిలో పెట్టడం చట్టరీత్యా నేరమన్నారు. డిసెంబర్–2025 నాటికి బాలకార్మికులు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ హిమబిందు, ఒకటో పట్టణ సీఐ బెండు అప్పారావు, దిశ పోలీస్ స్టేషన్ సీఐ నరసింగరావు, కార్మిక శాఖ అధికారులు ఎస్. సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, చంద్రశేఖర్, శ్రీనివాసరావు, పట్టణ ఐసీడీఎస్ సీడీపీఓ జి.ప్రసన్న, బాలల సంరక్షణ ఇన్‌చార్జి అధికారి యాళ్ల నాగరాజు, రామకోటి, వెంకటరావు, చైల్డ్‌లైన్ సిబ్బంది మీనా, అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బడికి పోదాం చలో చలో..

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- విద్యార్థులకు తొలిరోజే స్టూడెంట్ కిట్ల పంపిణీకి సన్నాహాలు
- జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల సంఖ్య: 2,232
- 2 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు: 2.33 లక్షల మంది



విజయనగరం అర్బన్: వేసవి సెలవులు ముగిశాయి. గణగణ మోగేందుకు బడిగంట ఉవ్విళ్లూరుతోంది. పుస్తకాల సంచులు, క్యారేజీ బ్యాగ్‌లను సిద్ధం చేసే పనిలో తల్లిదండ్రులు నిమగ్నమయ్యారు. పాఠశాలలు గురువారం పునఃప్రారంభం కానుండడంతో విద్యార్థులు ఆటపాటలకు సెలవు చెప్పి పుస్తకాల సంచులు తిరిగి భుజానికెత్తుకుని, విద్యాబుద్ధులు నేర్పే చదువులమ్మ చెట్టునీడకు చేరుకునేందుకు సన్నద్ధమవుతున్నారు.

ఆహ్లాదకర వాతావరణం

రంగురంగుల భవనాలు.. అద్దంలా మెరిసిపోయే ఫ్లోరింగ్... విజ్ఞానం పంచే బొమ్మలతో కూడిన తరగతి గదులు, విద్యార్థులను ఆకట్టుకునే డ్యూయల్ డెస్కులు.. చల్లని గాలినిచ్చే ఫ్యాన్లు... పరిశుభ్రతతో కూడిన టాయిలెట్లు, తాగునీటి సదుపాయాలతో ప్రభుత్వ బడులు విద్యార్థులకు స్వాగతం పలుకుతున్నాయి. మన బడి నాడు–నేడు పథకం కింద గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాఠశాలల రూపురేఖలను మార్చింది. చదువులకు ఆలవాలంగా తీర్చిదిద్దింది. నేటి నుంచి ప్రభుత్వ, ప్రైవేటు ప్రాథమిక పాఠశాలలను ఉదయం 9 నుంచి 3.30 గంటల వరకు, ఉదయం 9 నుంచి 4 గంటల వరకు ఉన్నత పాఠశాలలు నిర్వహిస్తారు. ప్రభుత్వ బడుల్లో ఉదయం 10 గంటలకు విద్యార్థులకు రాగిజావ ఇవ్వాలి. మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న భోజనం అందించాలి.

స్టూడెంట్ కిట్ల పంపిణీకి చర్యలు

గత ప్రభుత్వం పాఠశాలల పునఃప్రారంభానికి ముందే ఉత్సాహపూరిత వాతావరణం తీసుకొచ్చింది. కార్పొరేట్ స్కూళ్లను తలదన్నే రీతిలో వసతులు కల్పించింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పైసా ఖర్చు లేకుండా విద్యాకానుకలు అందించేందుకు సర్వం సిద్ధం చేసింది. ఇప్పుడు నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం వాటిని స్టూడెంట్ కిట్లుగా పేరు మార్చి పంపిణీకి ఏర్పాట్లు చేస్తోంది. స్కూల్ బ్యాగ్, మూడు జతల యూనిఫాం, ఒక జత షూస్, రెండు జతల సాక్సులు, బెల్టు, నోట్ బుక్స్, పాఠ్య పుస్తకాలు, డిక్షనరీ తదితర వస్తువులతో కూడిన రూ.2,500 విలువచేసే కిట్‌ను ప్రతి విద్యార్థికీ పాఠశాలలు తెరిచిన రోజే అందించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. జిల్లాలో 1.28 లక్షల మందికి స్టూడెంట్ కిట్లు అందజేయాల్సి ఉంది. అయితే, జిల్లాకు 63 శాతం కిట్లే వచ్చాయి. మిగిలినవి తెప్పించే ఏర్పాట్లలో జిల్లా విద్యాశాఖ అధికారులు నిమగ్నమయ్యారు.

జిల్లాలో పాఠశాలలు ఇలా...

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలకు చెందిన 2,232 విద్యాలయాల్లో 2,33,475 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో బాలికలు 1,12,873 మంది, బాలురు 1,20,602 మంది ఉన్నారు. నూతన విద్యావిధానాన్ని అమలు చేసిన నేపథ్యంలో ప్రభుత్వ స్కూళ్ల విభాగాలు కూడా నూతనంగా ఏర్పడ్డాయి. 1 నుంచి 5వ తరగతి వరకు ఫౌండేషన్ ప్లస్ స్కూళ్లుగా 1098, ఒకటవ, రెండవ తరగతి వరకు ఫౌండేషన్ స్కూళ్లుగా 218, ఒకటి నుంచి 8వ తరగతి వరకు ఉన్న ప్రీ హైస్కూల్స్ 184, ఆరు నుంచి 10వ తరగతి వరకూ ఉన్న హైస్కూళ్లు 142, అలాగే, 3 నుంచి 10వ తరగతి వరకు ఉన్న హైస్కూళ్లు 157 ఉన్నాయి. ప్రైవేటు స్కూళ్లలో ఫౌండేషన్ స్కూళ్లు 127, ప్రీ హైస్కూళ్లు 149, హైస్కూళ్లు 155 ఉన్నాయి.

తొలిరోజు నుంచే పంపిణీ..

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తొలి రోజునే స్టూడెంట్ కిట్స్‌ను పంపిణీకి సిద్ధం చేశాం. జిల్లాలో అర్హులైన 1.28 లక్షల మంది విద్యార్థులకు ఈ కిట్లను పంపిణీ చేస్తాం. వీటిని రెండు మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో జిల్లాకు చేరనునాయి. ఎప్పుడు వచ్చినవి అప్పుడే వెంట వెంటనే పాఠశాలలకు పంపి విద్యార్థులకు అందజేస్తాం.

– ఎన్.ప్రేమకుమార్, డీఈఓ

స్కూల్ రెడీనెస్

గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందుగా ప్రభుత్వం స్కూల్ రెడీనెస్ ప్రోగ్రాంఅమలు చేసింది. జిల్లా వ్యాప్తంగా ఎన్‌రోల్మెంట్ డ్రైవ్ చేపట్టింది. దీంతో పాటు పాఠశాలలను శుభ్రం చేయడం, తాగునీటి సౌకర్యాలు, మధ్యాహ్న భోజనానికి అవసరమైన విధంగా కిచెన్ షెడ్లు సిద్ధం చేయడం, చిన్నపాటి మరమ్మతులు, రికార్డు షీట్లు రెడీ చేయడం, అడ్మిషన్లు చేపట్టడం వంటి పనులను ఇప్పటికే ఉపాధ్యాయులు చేపట్టారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా పాఠశాలల ప్రారంభం రోజు నుంచే తరగతులు ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు.

క్లుప్తంగా

పీడీఎస్ బియ్యం తరలించిన వ్యక్తిపై కేసు నమోదు



విచారణ చేపడుతున్న సీఎస్‌డీటీలు జయలక్ష్మి, రవిశంకర్, శ్రీనివాస్

గంట్యాడ: మండలంలోని చంద్రంపేట గ్రామంలో ఉన్న రైస్ మిల్లు గోదాంకు మంగళవారం రాత్రి తరలించిన పీడీఎస్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. బుధవారం ఉదయంగం ట్యాడ సీఎస్‌డీటీ లగుడు జయలక్ష్మి, గజపతినగరం సీఎస్‌డీటీ రవిశంకర్, ఎస్. కోట సీఎస్‌డీటీ శ్రీనివాస్‌లు చంద్రంపేట మిల్లు వద్దకు చేరుకుని విచారణ చేపట్టారు. రెండుటన్నుల 300 కేజీల పీడీఎస్ బియ్యం తరలించినట్లు విచారణలో అధికారులు నిర్ధారించి పీడీఎస్ బియ్యాన్ని తరలించిన బి.ఎల్లాజీ అనే వ్యక్తిపై 6 ఎ కేసు నమోదు చేశారు. బియ్యాన్ని, బియ్యం తరలించిన ఆటోను సీజ్ చేసినట్లు సీఎస్‌డీటీ జయలక్ష్మి తెలిపారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం



అధికారులు స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండలం పి.లేవిడి నుంచి ఒడిశా వైపు వ్యానులో అక్రమంగా తరలిస్తున్న 50 బస్తాల పీడీఎస్ బియాన్ని విజిలెన్స్ అధికారులు గుమ్మలక్ష్మీపురం మండలం కళిగొట్టు జంక్షన్ వద్ద స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి, స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలను పౌరసరఫరాల అధికారులకు, వాహనాన్ని ఎల్విన్‌పేట పోలీసులకు అప్పగించినట్లు డీటీ రాజేంద్ర బుధవారం విలేకరులకు తెలిపారు.

ఫిజికల్ సైన్స్ డైరీ ఆవిష్కరణ



ఫిజికల్ సైన్స్ డైరీని ఆవిష్కరిస్తున్న డీఈఓ పగడాలమ్మ

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా ఫిజికల్ సైన్స్ టీచింగ్ డైరీని జిల్లా విద్యాశాఖ అధికారి పగడాలమ్మ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల ఫోరం నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు సైన్స్‌పై ఉండే భయాందోళన తొలగించే చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. జిల్లా సైన్స్ అధికారి గిరడ లక్ష్మణరావు రూపకల్పన చేసిన ఈడైరీ 240పేజీలతో వినూత్నంగా తయారుచేశారు. అన్ని అంశాలు డైరీలో పొందుపరిచారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ పెంట రామకృష్ణ, ఏఎంఓ శ్రీనివాసరావు, ఏఎస్ఓ రామకృష్ణ, ఏపీఓ హరిప్రసాద్, మన్యం జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ సతీష్‌రాజు, బెహరా సంతోష్, పెదప్రోలు శైలజ, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

బొల్లినేని మెడిస్కిల్స్ విద్యార్థినికి రూ.37 లక్షల ప్యాకేజీ



విద్యార్థిని అభినందిస్తున్న డాక్టర్ బొల్లినేని భాస్కరరావు

శ్రీకాకుళం రూరల్: రాగోలు జెమ్స్ ఆసుపత్రిలోని బొల్లినేని మెడిస్కిల్స్ విద్యార్థిని నిస్సీ ప్రతిభ కనబరిచింది. బ్రిటన్‌లో ఏడాదికి రూ.37 లక్షల వేతన ప్యాకేజీకి ఎంపికైంది. ఈ మేరకు బొల్లినేని మెడిస్కిల్స్ సెంటర్ హెడ్ సీహెచ్ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీఎస్సీ కార్డియోకేర్ టెక్నాలజీ కోర్సు పూర్తిచేసిన నిస్సీ.. ఇంటర్న్‌షిప్ కోసం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చేరింది. అందులో పనిచేస్తూ యూకేలోని నేషనల్ హెల్త్ సర్వీసెస్ ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలో ఎంపికైంది. ఈమె ఎంపిక పట్ల జెమ్స్ మెడికల్ కాలేజ్ చీఫ్ మెంటార్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు అభినందించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹260

జీవన ఎరువులతో భూసారం

- నత్రజనిని స్థిరీకరించి, భాస్వరం అందజేత
- బ్యాక్టీరియా విస్తరించి పంటలకు మేలు



దుక్కి దున్ని పంటపొలాన్ని సిద్ధం చేసిన రైతు



ఎస్.లక్ష్మినారాయణ, శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన స్థానం, సీతంపేట

సీతంపేట: ఖరీఫ్ పంటల సాగుకు రైతులు ఇప్పుడిప్పుడే దుక్కులు చేస్తూ, పంటపొలాలను తయరు చేసుకుంటున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 80 వేల హెక్టార్ల వరకు ఖరీఫ్ సీజన్‌లో వివిధ పంటల సాగు జరుగుతుంది. అధికంగా రసాయన ఎరువులు వినియోగించడంతో పంటలు బండబారిపోయాయి. పంటలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు, సూక్ష్మపోషకాలు వంటివి కనిపించకుండా పోతున్నాయి. ఈ పరిస్థితుల్లో భూసారం పెంపుదలకు జీవన ఎరువుల వాడకమే కీలకం. మొక్కల్లోనూ, పంట భూముల్లో పోషక పదార్థాలను విడుదల చేసి మొక్కలను అందుబాటులోకి తెచ్చే జీవులను జీవన ఎరువులు అంటారు. జీవన ఎరువుల వాడకం, ప్రయోజనాల గురించి స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఎస్.లక్ష్మీనారాయణ రైతులకు ఇలా వివరించారు.

జీవన ఎరువుల్లో రకాలు..

భాస్వరాన్ని వినియోగంలోకి తెచ్చి మొక్కకు అందించే సూక్ష్మజీవులు నత్రజనిని స్థిరీకరించే విధానాన్ని బట్టి నత్రజనిని స్థిరపరిచే సూక్ష్మజీవులను రెండు రకాలుగా వర్గీకరించారు.

నీలి ఆకుపచ్చ నాచు..

ఇది నీటి ఆధారిత భూములకు అవసువైన ఎరువు. నీటిలో అభివృద్ధి చెందుతుంది. ఈ ఎరువు మట్టితో కలిపి ఎండిన మట్టి గడ్డల రూపంలో లభ్యమవుతుంది. వరి నాటిన 7–10 రోజుల లోపు నీటి అకుపచ్చ నారు ఎరువు ఎకరాకు 4–6 కిలోల పొలంలో నీటిలో చల్లాలి. నాచు వేసిన తరువాత పొలంలో నీరుండే విధంగా జాగ్రత్త పడాలి. ఈ నాచును మూడు సీజన్ల పాటు క్రమం తప్పకుండా వాడితే ఆ తరువాత పంటలకు కూడా ఉపయోగపడుతుంది.

అజటోబాక్టర్..

ఈ జీవన ఎరువు పత్తి, మిరప, వరి, పొగాకు, చెరకు, జొన్న, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, ఆవాలు, కూరగాయలు, పండ్లు, పూల తోటలకు ఉపయోగపడుతుంది. ఈ బ్యాక్టీరియా నత్రజనిని స్థిరీకరించడమే కాకుండా మొక్కకు కావాల్సిన హార్మోన్లు, విటమిన్లను అందిస్తుంది. దీన్ని ఏ పంటకు వాడినా భూమిలో తగినంత తేమ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. దీనివల్ల పంట దిగుబడి కూడా 15 శాతం పెరుగుతుంది.

అజిస్పైరిల్లం..

ఈ బ్యాక్టీరియా మొక్క వేర్ల చుట్టూ పెరుగుతూ అవకాశమున్న చోట వేళ్లలోకి చొరబడి జీవిస్తాయి. ఈ కారణంగా ఈ జీవన ఎరువు స్థిరీకరించిన నత్రజని నేరుగా మొక్కకు ఎక్కువ శాతం అందుబాటులో ఉంటుంది. వరి, చెరకు, పత్తి, మిర్చి, జొన్న, సజ్జ, పొద్దుతిరుగుడు, మొదలైన పంటలకు బాగా ఉపయోగపడుతుంది. ఎకరాకు రెండు కిలోల జీవన ఎరువును 80–100 కిలోల సేంద్రీయ ఎరువులో కలిపి పొలంలో వేసుకోవాలి.

మైకోరైజా..

ఇది శిలీంధ్రపు జాతికి చెందిన జీవన ఎరువు. మొక్క వేళ్లు కూడా చొరబడ లేని భూమి అడుగు పొరల్లోకి చొచ్చుకు పోయి మొక్కలకు భాస్వరంతో పాటు సూక్ష్మపోషకాలైన జింక్, కాపర్, సల్ఫేట్, మాంగనీస్, ఇనుము అందిస్తుంది. మైకోరైజా వాడిన మొక్కలలో నీటి ఎద్దడిని తట్టుకోవడం రోగ నిరోధక శక్తి పెరగడం గమనించవచ్చు. ఎకరాకి 5 కిలోల జీవన ఎరువు వేయాలి. తప్పనిసరిగా విత్తనం కింద మాత్రమే వాడేలా చూడాలి.

భాస్వరాన్ని అందించే జీవన ఎరువులు..

పాస్ఫో బ్యాక్టీరియా మొక్కకు భాస్వరాన్ని అందించడంతో పాటు మొక్కలకు కావాల్సిన హర్మోన్లను సరఫరా చేస్తుంది. మొక్కలకు రోగ నిరోధక శక్తి పెంపొందిస్తుంది. దీని వల్ల పంట దిగుబడి పెరుగుతుంది.

మొక్కలతో కలిసి నత్రజని స్థిరీకరణ

లెగ్యూమ్ జాతి పంటలు, పప్పుజాతి పంటలకు నత్రజనిని అందించే జీవన ఎరువు పప్పుజాతి పైర్లలో ముఖ్యమైన కంది, పెసర, మినుము, వంటి పైర్లకు రైజోబియం కల్చర్‌ను విత్తనానికి పట్టించి వాడాలి. దీన్ని వాడడం వల్ల మొక్క వేళ్లపై లేత గులాబీరంగు కలిసిన బుడిపెలు ఏర్పడతాయి. ఈ బుడిపెలలో ఉన్న రైజోబియం గాల్లోని నత్రజనిని స్థిరీకరించి మొక్కలకు అందిస్తుంది. ఈ రైజోబియం కల్చర్ ఒక్కో పంటకు ఒక్కో ప్రత్యేకతతో ఉంటుంది. రైతులు ఏ పంట వేస్తారో ఆ పంటకు నిర్దేశించిన రైజోబియం మాత్రమే వాడాలి.

100 మిల్లీ లీటర్ల నీటిలో 10 గ్రాముల పంచదార లేదా బెల్లాన్ని లేదా గంజి పొడర్‌ను కలిపి పది నిమిషాల పాటు మరగబెట్టి చల్లార్చాలి. చల్లారిన ద్రావణం 10 కిలోల విత్తనాలపై చల్లి దానికి 200 గ్రాముల రైజోబియం కల్చర్ పొడిన బాగా కలిపి విత్తనం చుట్టూ పొరలా ఏర్పడేలా జాగ్రత్త తీసుకోవాలి. రైజోబియం కల్చ ర్‌ను పట్టించిన విత్తనాలను పది నిమిషాల పాటు నీడలో ఆరబెట్టి పొలంలో విత్తుకోవాలి.

అజోల్లా ..

ఈ జీవన ఎరువు నీటిపై తేలియాడుతూ వరి పొలంలో పెరిగే ఫెర్న్ జాతి చిన్న మొక్క అయిన అజోల్లా, అనబినా అనే సైనో బ్యాక్టీరియాకు ఆశ్రయం కల్పించి నత్రజనిని స్థిరీకరించి వరిపైరుకు అందజేస్తుంది. ఈ జీవన ఎరువు ఒక నత్రజనిని మాత్రమే గాక, సేంద్రీయ కర్బనం, పొటాషియాన్ని పైరుకు అందిస్తుంది. ఇది భూమి భౌతిక గుణాలను, భూసారాన్ని పెంపొందిస్తుంది. ఈ జీవన ఎరువుల ఉష్ణోగ్రత తక్కువగా ఉండి తగినంత నీటి వసతి, భాస్వరం పోషకం ఉన్నచోట బాగా పెరుగుతుంది. వరినాటిన వారం తరువాత 200 కిలోల అజోల్లా జీవన ఎరువును ఒక ఎకరంలో వెదజల్లి 15–20 రోజుల నీటిపై బాగా పెరగనివ్వాలి. తరువాత నీటిని తొలగిస్తే 3–4 రోజుల్లో కుళ్లి నత్రజనిని, ఇతర పోషకాలను మొక్కకు అందిస్తుంది. రైతులు దీన్ని పచ్చిరొట్ట ఎరువుగా పెంచి దమ్ములో కలియదున్నితే ప్రయోజనం అధికంగా ఉంటుంది.

విద్యార్థి కిట్‌ల పంపిణీ పరిశీలన



ఆటోలో తరలిస్తున్న కిట్‌లను పరిశీలిస్తున్న డీఈఓ జి పగడాలమ్మ

సీతానగరం: మండలంలోని అన్ని పాఠశాలకు పాఠ్యపుస్తకాల కిట్‌లను సక్రమంగా చేరవేయనున్నట్లు పార్వతీపురం మన్యం .జిల్లా డీఈఓ జి.పగడాలమ్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం, స్థానిక ఉన్నత పాఠశాల నుంచి నిర్దేశించిన పాఠశాలలకు ఎంఈఓ–1 –2 జి. సూరిదేముడు, ఎంవీ రమణ ఆధ్వర్యంలో ఆటోలతో పంపిణీ చేస్తున్న కిట్‌లను డీఈఓ జి. పగడాలమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులకు ఇస్తున్న కిట్‌లను గురువారం ఉదయం పాఠశాలలు తెరిచేలోగా చేరవేయాలని సూచించారు. విద్యార్థులందరికీ కిట్‌లు అందలేదన్న మాట రానివ్వకుండా ఎంఈఓలు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు అవసరమైన కిట్‌లు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నందున ఉపాధ్యాయులకు సకాలంలో అప్పగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ జగదీష్, సీఆర్పీలు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి

- జిల్లా రవాణా శాఖాధికారి శశి కుమార్
- 37 ఆటోలపై కేసులు



పట్టణంలో వాహన తనిఖీలు చేస్తున్న అధికారులు

పార్వతీపురంటౌన్: జిల్లాలో ఈ మధ్యకాలంలో ఆటో రిక్షాలలో అధిక ప్రయాణికులతో ప్రయాణిస్తూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో రాష్ట్ర రవాణా శాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రవాణా శాఖ మూడు రోజులుగా ఆటో రిక్షాలను ప్రత్యేక తనిఖీ చేస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా రవాణా శాఖాధికారి శశికుమార్ తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి 37 ఆటోలపై కేసులు నమోదు చేసి అపరాధ రుసుము వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన పత్రాలు లేని కొన్ని ఆటోలను సీజ్ చేశామన్నారు. అధిక ప్రయాణికులతో ప్రయాణం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా వాహనాలు నడపడంపై ఆటో డ్రైవర్స్‌కు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. జిల్లాలో గల 81 స్కూల్, కాలేజీ బస్సులలో నేటి వరకు 60 స్కూల్స్, కాలేజీ బస్సులకు వాహన సామర్థ్యం పునరుద్ధరించామని వాహన సామర్థ్యం పునరుద్ధరణ చేసుకోని మిగిలిన 21 స్కూల్, కాలేజీ బస్సుల యాజమాన్యం వెంటనే వాహన సామర్థ్య పునరుద్ధరణ చేసుకోవాలని కోరారు.

వసతిగృహాల్లో స్ప్రేయింగ్ పూర్తి

- డీఎంఓ డాక్టర్ టి.జగన్ మోహనరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంఓ డాక్టర్ టి.జగన్ మోహనరావు

పార్వతీపురం టౌన్: పాఠశాలల పునఃప్రారంభం నాటికి వసతిగృహాల్లో దోమల నివారణ మందు పిచికారీ పూర్తి కావచ్చిందని పార్వతీపురం మన్యం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మలేరియా కార్యాలయంలో మాట్లాడుతూ వసతి గృహాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా జిల్లాలో ఉన్న గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఏసీఎం5% దోమల మందు స్ప్రేయింగ్ చేయించామని, తద్వారా పాఠశాలలు ప్రారంభం నాటికి దోమల ప్రభావం తగ్గి విద్యార్థుల్లో సీజనల్ జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. ఇప్పటికే మలేరియా ప్రభావిత గ్రామాల్లో మొదటి విడత దోమల మందు పిచికారీ కొనసాగుతోందని, 287 గ్రామాల్లో పూర్తి కావచ్చిందని ఇంకా 114 గ్రామాల్లో జరగనుందని తెలిపారు. వసతి గృహాల పరిధిలో వైద్య సిబ్బంది వద్ద అవసరమైన జ్వర నిర్ధారణ పరీక్షలు, మందులు అందుబాటులో ఉంచాలని, పలు గ్రామాల నుంచి హాస్టల్స్‌లో చేరబోయే విద్యార్థుల ఆరోగ్యంపై వైద్యసిబ్బంది దృష్టి సారించాలని సూచించారు.

సంతలో సౌకర్యాలు మెరుగుపర్చాలి



వారపు సంత నిర్వహణకు నిబంధనలు చదువుతున్న కార్యదర్శి వాసంతి



పెదమానాపురంలో వారపు సంతలో పశువులు షెడ్లులను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం వారపు సంతలో ఉన్న సౌకర్యాలతో పాటు కొత్త సౌకర్యాలు కల్పించి మరింత మెరుగుపర్చాలని గజపతినగరం మార్కెట్ కమిటీ కార్యదర్శి చంద్రమౌళి అన్నారు. ఈ మేరకు బుధవారం సంత ఆవరణలో పంచాయతీ కార్యదర్శి వాసంతి అధ్యక్షతన సంత యజమానులు, త్రిసభ్యకమిటీ సభ్యులైన పోలీస్, రెవెన్యూ, పశు వైద్యాధికారులతో లైసెన్స్ రెన్యువల్ గురించి సంతలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దూర ప్రాంతాల నుంచి పశువుల కొనుగోలు, అమ్మకాలకు వచ్చే వ్యాపారులకు తాగునీరు, నీడ షెడ్లులు తప్పనిసరిగా ఉండాలని ఆయన సూచించారు. పశువులను లారీలో ఎక్కించేటప్పుడు గాయాలపాలు కాకుండా ర్యాంపుల నిర్మాణం, సీసీ కెమెరాల ఏర్పాటు, తాగునీటి బోర్లు, పశువులు షెడ్డుల నిర్మాణం తదితర సౌకర్యాలు కల్పించినట్లు సంత నిర్వాహకులు రౌతు విజయలక్ష్మీరాము, గోవిండ్, కనిమొరక తిరుపతి అధికారులకు వివరించారు. అనంతరం ఆయన సంతలో ఏర్పాటు చేసిన సౌకర్యాలు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. సంత నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరలో లైసెన్స్ మంజూరు చేయనున్నట్లు కమిటీ సభ్యులు నిర్వాహకులకు హామీ ఇచ్చారు.

గీత కార్మికులకు వైన్‌షాపులివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నాయకుడు అప్పారావు

విజయనగరం ఫూల్‌బాగ్: తెలుగుదేశం పార్టీ హామీ ఇచ్చిన విధంగానే రాష్ట్రంలో ఉన్న కల్లుగీత కార్మికులకు 40శాతం వైన్ షాపులను కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ కల్లు గీత కార్మిక సంఘం విజయనగరం జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం విజయనగరం జిల్లా కేంద్రంలోని కేఎల్ పురం (సీఐటీయూ కార్యాలయం)లో సమావేశం జరిగింది.ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేయబోయే యాత సాధికారత కార్పొరేషన్ చైర్మన్ పదవి విజయనగరం జిల్లాకు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఉత్తరాంధ్ర జిల్లాల్లో విజయనగరం జిల్లాలోనే యాత కులస్తులు అధికంగా ఉన్నారన్నారు. వైన్ షాపుల్లో ఉద్యోగులుగా కల్లు గీత కార్మిక కుటుంబాలకే అవకాశం కల్పించాలని కోరారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో సుమారు ఆరు లక్షల మంది యాత కులస్తులు ఉన్నారని స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి ఇంతవరకు ఒక్క ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కానీ లేరన్నారు. కల్లు గీత కార్మికులకు రూ.4వేలు పింఛన్లు, చంద్రన్న బీమా కింద రూ.పది లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాత కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జమ్మల అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిమ్మ అప్పారావు, జిల్లా కన్వీనర్ కొలుసు శ్రీను, కోశాధికారి బంగారు నాయుడు, యాత సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొర్లె సూరిబాబు, శెట్టి బలిజ సంక్షేమ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు గుత్తుల మధుసూదన్ రావు, సొసైటీ ప్రెసిడెంట్లు అప్పల స్వామి, జి.దేవుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ పురస్కారాలు ప్రదానం



ప్రొఫెసర్ పుష్పనాథాన్ని సత్కరిస్తున్న దృశ్యం

విజయనగరం: ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ప్రావీణ్యం కనబరిచిన వారికి రోటరీ పురస్కార్ కార్యక్రమంలో భాగంగా బుధవారం అవార్డుల ప్రదానోత్సవం చేశారు. రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్‌వీఎన్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులు, వ్యాపార రంగంలో రాణించిన వారికి అవార్డులు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు వీవీ రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు నాగ సుందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉద్యోగ వ్యాపార రంగాలలో విజయవంతంగా సేవలు అందిస్తున్న వారిని ప్రశంసించారు. సామాజిక అభివృద్ధిలో ఉద్యోగ, వ్యాపార వర్గాల పాత్ర క్రియాశీలకమైనదని పేర్కొన్నారు. మహేశ్వరి ఫ్లోర్ మిల్స్ యజమాని, హార్మోని కంపెనీ వ్యవస్థాపకుడు దిలీప్, ప్రొఫెసర్ డాక్టర్ కె.పుష్పనాథం లను ఈ సందర్భంగా సత్కరించారు. పలువురు ప్రభుత్వ ఉద్యోగులను సత్కరించి, రోటరీ పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వీవీ రాజేష్, సెక్రటరీ అరుణ్ కుమార్ సాదాని, ఒకేషనల్ సర్వీస్ డైరెక్టర్ వీఎస్.కిరణ్‌కుమార్, చైర్మన్ జి.జగదీష్, జయకృష్ణ, కాపుగంటి ప్రకాశ్‌లతోపాటు ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటిస్ మేళా రేపు

బొబ్బిలి: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 14న అప్రెంటిస్ షిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జీవీ రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు.

హైదరాబాద్‌లోని మేథో సర్వో కంపెనీలో 200 ఖాళీలను భర్తీ చేసే నేపథ్యంలో మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడ్‌లలో ఉత్తీర్ణులైన వారు అర్హులని, ఆసక్తి ఉన్న వారు ఈనెల 14న ఉదయం 10 గంటలకు అన్ని ధ్రువీకరణ పత్రాలు, ఫొటోలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.14,200 శిక్షణ భృతితో పాటు డ్యూటీలో సబ్సిడీ ధరలతో కూడిన ఆహారం ఇవ్వనున్నట్లు చెప్పారు.

వేతనదారులకు ‘ఉపాధి’

- 1.12 కోట్ల పనిదినాల కల్పన
- రోజుకు 2.10 లక్షల మంది పనికి హాజరు
- జిల్లాలో జాబ్ కార్డులు 3.45 లక్షలు
- రూ.256.55 కోట్లు వేతనాల చెల్లింపు



గంట్యాడ మండలంలో పని చేస్తోన్న ఉపాధిహామీ వేతనదారులు

విజయనగరం ఫోర్ట్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అధిక సంఖ్యలో వేతనదారులకు పని కల్పించారు. ఈ మేరకు విజయనగరం జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో 1.12 కోట్ల పనిదినాలు కల్పించారు. జిల్లాలో జరుగుతున్న ఉపాధి పనులకు ప్రతిరోజూ లక్షలాది మంది వేతనదారులు వెళ్తున్నారు. వేసవిలో ఎటువంటి పనులు ఉండని నేపథ్యంలో వేతనదారులు ఎక్కువ మందికి పనికి వస్తున్నారు. ఉదయం 5గంటలకే పనికి వెళ్తూ ఎండతీవ్రత ఎక్కువ కాకముందు ఇంటికి వస్తున్నారు.

లక్షల్లో వేతనదారులు

జిల్లాలో 3.45 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. వాటిలో 6.05 లక్షలమంది వేతనదారులు ఉన్నారు. 2024–25 సంవత్సరంలో రోజుకి 2.10 లక్షల మంది వేతనదారులు పనికి హాజరవుతున్నారు. వేతనదారులకు ఇప్పటివరకు రూ.256.55 కోట్లు చెల్లింపులు జరిగాయి.

చేపట్టే పనులు ఉపాధి హామీ పథకం ద్వారా నీటి వనరులు, వాగులు, కుంటలు, చెరువుల ఆధునికీకరణ, పొలాల చుట్టూ సరిహద్దు అంతర్గతంగా కందకాలు, పంటకుంటలు, ఊట కుంటలు, ఇంకుడు గుంతలు తవ్వడం వంటి పనులు చేపడతారు. రైతుల పొలాల్లో ఉద్యాన, పండ్ల తోటల పెంపకం చేపడతారు.

అధికసంఖ్యలో వేతనదారులు

ఉపాధిహామీ పనులకు ప్రతిరోజూ అధిక సంఖ్యలో వేతనదారులు వస్తున్నారు. ఇప్పటివరకు కోటికిపైగా పని దినాలు కల్పించాం.

జి. ఉమాపరమేశ్వరి, పీడీ, జిల్లా నీటియాజమాన్య సంస్థ